సాక్షి


డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 2 । అక్టోబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర ఆలయంలో నిత్యాన్నదానానికి గిద్ద వీరరాఘవులు (తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం) ఆదివారం రూ.50,116 విరాళం సమర్పించారు.



తీగలకు రాజకీయ అడ్డగింతలు

ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు విపక్ష టీడీపీ మద్దతుదారులు మోకాలడ్డుతున్నారు. - వివరాలు 8లో▸

కడలిలోకి 2.92 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 2,92,297 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 5 వేల చొప్పున మొత్తం 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.85, భద్రాచలం వద్ద 22.90 అడుగులుగా నీటి మట్టాలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

రాయవరం: పాలిటెక్నిక్ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏపీ పాలిసెట్–2023 కన్వీనర్ పేరిట ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల మూడో తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. 5న స్పాట్ అడ్మిషన్ల వివరాలు వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. 6న ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలి. ఆయా కళాశాలలు స్పాట్ అడ్మిషన్ల జాబితాలను 9వ తేదీలోగా కన్వీనర్, పాలిసెట్–2023 అడ్మిషన్ల పేరిట ఇన్ పర్సన్ అందజేయాలి. జిల్లా వ్యాప్తంగా వివిధ పాలిటెక్నిక్ కళాశాలల్లో సుమారు వివిధ కోర్సుల్లో 2 వేల ఖాళీలు ఉన్నట్లు సమాచారం. పాలిసెట్ రాయని వారు, రాసిన వారు, అర్హత ఉండి, ఆసక్తి ఉన్న విద్యార్థులు వెంటనే పాలిసెట్ అడ్మిషన్లు పొందాలని పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.రామారావు తెలిపారు. ఇతర వివరాలకు 94401 24846 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'




ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి గ్రామంలో స్పెషలిస్టు డాక్టర్లతో వైద్య సేవలు అందించడం, బీపీ, షుగర్, డెంగీ, మలేరియా, రక్త, మూత్ర పరీక్షలు చేయడంతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు ఉచితంగా ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సేవలు పొందిన రోగులకు అవసరాన్ని బట్టి 112 రకాల మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని వివరించారు. దీర్ఘకాలిక రోగులను ఆరోగ్యశ్రీకి అనుసంధానం చేసి మెరుగైన చికిత్స కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపించి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇక నుంచి ప్రతి గ్రామంలో నెలకొకసారి జరిగే ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజలు వెళ్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

బాధితుల రక్షణలో వలంటీర్లు కీలకం కావాలి

అమలాపురం రూరల్: ప్రమాద బాధితుల రక్షణలో రెడ్‌క్రాస్ వలంటీర్లు కీలకంగా వ్యవహరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ఆదివారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ప్రథమ వైద్య చికిత్స విధానాలపై 34 మంది రెడ్‌క్రాస్ వలంటీర్లకు ఒకరోజు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాత్కాలిక ప్రథమ చికిత్సపై అవగాహన పెంచుకోవాలన్నారు. అగ్ని, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు తాత్కాలిక చికిత్స చేయడం తదితర అంశాలపై తప్పనిసరిగా తర్ఫీదు పొందాలని అన్నారు. అనంతరం శిక్షణ పొందిన అభ్యర్థులకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ, కార్యదర్శి పీఎస్ శర్మ, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ సత్యనారాయణరాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిత్యాన్నదాన పథకం భవన నిర్మాణానికి భక్తుల నుంచి భారీగా విరాళాలు వస్తున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆకివీడు మండలం ఐ.భీమవరానికి చెందిన ఎం.దుర్గారావు, కుమారి దంపతులు రూ.20 వేలు, గణపవరానికి చెందిన కేవీ రమేష్‌బాబు, వరలక్ష్మి దంపతులు రూ.18 వేలు, గండేపల్లికి చెందిన ఇ.గణేష్, దుర్గాదేవి రూ.11,116, రాజోలుకు చెందిన జి.సూర్యనారాయణమూర్తి, సూర్య సుభద్ర దంపతులు రూ.10,500, విజయవాడకు చెందిన ఎస్.దీపక్ రూ.10,222, అనకాపల్లికి చెందిన కె.రాము, వెంకటలక్ష్మి దంపతులు రూ.10,116, కొవ్వూరుకు చెందిన నాయుడుసుధ రూ.10 వేలు విరాళాలుగా అందించారన్నారు. అలాగే వెదిరేశ్వరానికి చెందిన వి.నాగమల్లేశ్వరరావు, వెంకట పద్మ దంపతులు పది ఫ్యాన్లు అందించినట్లు వివరించారు. దాతలకు స్వామివారి చిత్రపటాలను ఈఓ సత్యనారాయణరాజు అందజేశారు.

చేతివాటానికి చెక్

- ద్వాక్రాలో ఇక డిజిటల్ చెల్లింపులు
- ఇటీవల స్త్రీనిధి సొమ్ము పక్కదారి
- రూ.లక్షల్లో మోసపోతున్న మహిళా సంఘాలు
- అరికట్టేందుకే సరికొత్త విధానం
- జిల్లాకు 21 పేటీఎం యంత్రాలు



అమలాపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డిజిటల్ చెల్లింపులు



సాక్షి, అమలాపురం: సరికొత్త ఆలోచనలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.. స్త్రీనిధి బ్యాంకు రుణ వ్యవహారాల్లో చేతివాటానికి చెక్ పెట్టేందుకు నూతన విధానానికి నాంది పలికింది. మహిళా స్వయంశక్తి సంఘాల (ఎస్‌హెచ్‌జీ) రుణాలపై వాయిదాల సొమ్మును డిజిటల్ విధానంలో చెల్లించేందుకు శ్రీకారం చుట్టింది. అమలాపురం మండలంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం విజయవంతం కావడంతో దశల వారీగా జిల్లా అంతా విస్తరించనుంది. మహిళా స్వయం శక్తి సంఘాలకు వాణిజ్య బ్యాంకుల నుంచి అందే రుణాలే కాకుండా స్త్రీనిధి బ్యాంకు నుంచి వ్యక్తిగత రుణాలందుతాయి. ఒక్కొక్కరికీ రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ రుణాలు ఇస్తారు. ప్రతి మహిళను లక్షాధికారి చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా జిల్లాలో మహిళలకు ఇచ్చే రుణ పరపతిని అధికారులు పెంచారు. స్త్రీనిధి బ్యాంకు ద్వారా ఈ ఏడాది రూ.వెయ్యి కోట్ల వరకూ రుణాలు ఇస్తున్నారంటే రుణ పరిమితి ఏ స్థాయిలో పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

వెలుగుచూసిన మోసాలెన్నో..

స్త్రీనిధి బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న మహిళలు చాలామంది వాయిదా సొమ్మును నేరుగా కాకుండా యానిమేటర్లు, గ్రామ సమైఖ్య సహాయకులు (వీఓఏ), క్లస్టర్ కో ఆర్డినేటర్ (సీసీ)ల ద్వారా చెల్లిస్తుంటారు. ఇదే అదనుగా కొంతమంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో ఇటీవల మహిళా స్వయం శక్తి సంఘాల రుణాల వాయిదాల సొమ్ము, పొదుపు, స్త్రీనిధి రుణాలను రూ.లక్షల్లో దోచేశారు. ఆత్రేయపురం మండలం పేరవరం, బొబ్బర్లంక, రాజవరం, మెర్లపాలెం, అమలాపురం మండలం పేరూరు వంటి చోట్ల యానిమేటర్లు, వీఓఏలు, సీసీలు కలసి చేసిన మోసాలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ అక్రమాలు రూ.పది లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ వెలుగు చూడడం గమనార్హం. అంబాజీపేట మండలం మాచవరంలో ఓ యానిమేటర్ రూ.20 లక్షలకు పైగా చేతివాటం ప్రదర్శించగా, పేరూరులో రూ.16.80 లక్షల స్త్రీనిధి, పొదుపు సొమ్ముతో పాటు రూ.28.09 లక్షల బ్యాంకు రుణం సొమ్ము పక్కదారి పట్టించడం తెలిసిందే.

అప్రమత్తం.. చర్యలు పటిష్టం

వెలుగు చూస్తున్న అక్రమాలతో అప్రమత్తమైన డీఆర్‌డీఏ పలు చర్యలు చేపట్టింది. నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. తప్పు జరిగిన తరువాత బాధ్యులపై చర్యలు తీసుకోవడం కన్నా, అసలు తప్పు జరగకుండా చూడాలని నిర్ణయించింది. ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంది. ప్రతి నెలా జరిగే సమాఖ్య సమావేశాల్లో వాయిదాల చెల్లింపుపై ప్రత్యేకంగా చర్చిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలపై ఆరా తీయడంతో పాటు సంఘాలు సక్రమంగా వాయిదాలు చెల్లిస్తున్నదీ లేనిదీ, వీవోఏలు, సీసీలు వాటిని జమ చేస్తున్నదీ, లేనిది పరిశీలిస్తున్నారు. సొమ్ము ఎవరికీ ఇవ్వొద్దని, బ్యాంకులో నేరుగా చెల్లించాలని చెబుతున్నారు. రుణాల వాయిదాలు, స్త్రీ నిధుల వాయిదాలు సిబ్బందికి చెల్లిస్తే రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సంఘాలకు చెబుతున్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి పలు సందర్భాలలో తీసుకువెళ్లారు.

డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం

స్త్రీనిధి బ్యాంకు వాయిదాల చెల్లింపుల్లో జరుగుతున్న చేతివాటానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. వీటికి కొనసాగింపుగా డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. పేటీఎం సంస్థతో డీఆర్‌డీఏ ఒప్పందం చేసుకుంది. గత వారం అమలాపురం మండలంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన డిజిటల్ చెల్లింపులు విజయవంతం కావడంతో దీనిని మరింత విస్తరించింది. జిల్లాలో నాలుగు క్లస్టర్ల పరిధిలో ఒక్కొక్క మండలాన్ని ఎంపిక చేసింది. అమలాపురం క్లస్టర్‌లో అమలాపురం మండలం, రామచంద్రపురం క్లస్టర్‌లో మండపేట, కొత్తపేట క్లస్టర్‌లో రావులపాలెం, రాజోలు క్లస్టర్‌లో మలికిపురం మండలాలను ఎంపిక చేశారు. మండలానికి నాలుగు చొప్పున మొత్తం 16 పేటీఎం యంత్రాలను సిద్ధం చేశారు. వీటితో పాటు స్త్రీనిధి బ్యాంకు సిబ్బందికి నాలుగు, బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు ఒకటి చొప్పున మొత్తం 21 యంత్రాలను వినియోగించనున్నారు. అక్టోబర్ 1 నుంచి ఎంపిక చేసిన మండలాల్లో పూర్తిస్థాయిలో డిజిటల్ చెల్లింపులు ప్రారంభం కానున్నాయి.

చెల్లింపులు ఎలా అంటే..

రుణం పొందిన ద్వాక్రా సంఘాలు డిజిటల్ చెల్లింపులలో భాగంగా ఫోన్‌పేలో వాయిదాలు చెల్లించవచ్చు. మొత్తం గ్రూపు సభ్యులంతా వాయిదా సొమ్మును యానిమేటర్ వద్ద ఉన్న పేటీఎం యంత్రం ద్వారా చెల్లించవచ్చు. ఫోన్ పే నుంచి చెల్లింపుల సమయంలో సంఘం ఐడీ నంబర్ ఎంటర్ చేస్తే ఆ గ్రూపునకు చెందిన రుణ ఖాతాలో జమ అవుతుంది. పేటీఎం యంత్రం నుంచి వచ్చే రిసీప్ట్‌లో గ్రూపు పేరు, ఐడీ, ఇతర వివరాలు ఉంటాయి. ఇది విజయవంతమైతే జిల్లాలో మండలానికి మూడు చొప్పున పేటీఎం యంత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటారు.

ధైర్యం వస్తుంది



స్త్రీనిధి, బ్యాంకుల నుంచి మాకు అధిక రుణాలు వస్తున్నాయి. నాకు బ్యాంకు ద్వారా రూ.1.80 లక్షల రుణం అందితే, స్త్రీనిధి బ్యాంకు నుంచి రూ.50 వేల వరకూ రుణం వచ్చింది. సిబ్బంది చాలా నమ్మకంగా సేవలందిస్తున్నారు. కానీ చుట్టూ జరుగుతున్న విషయాలు తెలుస్తుంటే భయమేస్తోంది. ఇప్పుడు నేరుగా డిజిటల్ రూపంలో చెల్లింపులతో మాకు చాలా ధైర్యంగా ఉంటోంది.

– మట్టపర్తి మంగాలక్ష్మి, ఎ.వేమవరప్పాడు, అమలాపురం మండలం

త్వరలో జిల్లా అంతటా..



డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు నాలుగు మండలాల్లో మొదలు కానున్నాయి. త్వరలో వీటిని జిల్లా అంతటా విస్తరించనున్నాం. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాం. దీనికి స్పందించిన ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులకు అనుమతి ఇచ్చింది.

– డాక్టర్ వి.శివశంకర్ ప్రసాద్, పీడీ, డీఆర్‌డీఏ

కేశవదాసు విగ్రహానికి స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు వినతిపత్రం ఇస్తున్న యాదవ సంఘం నేతలు

మలికిపురం: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆలయ మూల విరాట్ నిర్మాత మందపాటి కేశవదాసు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. ఆదివారం మలికిపురం మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దకు జిల్లా వ్యాప్తంగా యాదవ సంఘీయులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కలియుగం ఆరంభంలో అంతర్వేదిలో నరసింహస్వామి భక్తుడైన మందపాటి కేశవదాసుకు స్వామివారు కలలోకి వచ్చి తన ఆలయం నిర్మించాలని చెప్పారని చెబుతుంటారన్నారు. దీంతో కేశవదాసు పందిరి వేసి నరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారన్నారు. అలాంటి కేశవదాసు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వారు కోరారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ఆలయ చరిత్రలో కీలకమైన కేశవదాసుకు తగిన గుర్తింపు లభించేలా ఇక్కడ విగ్రహం ఏర్పాటుకు సీఎం జగన్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు అల్లి రాజబాబు, ఉభయ గోదావరి జిల్లాల బీసీ సెల్ రీజినల్ కోఆర్డినేటర్, కాకినాడ జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు మాసుమేను గంగయ్య, మట్ట రాంబాబు, కైలా శోభన్‌బాబు, కానుబోయిన దుర్గాప్రసాద్, మట్ట శివ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వంటకూ కీలకపాత్ర

- మిడ్ డే మీల్ ఏజెన్సీలకు మంచి కబురు
- మధ్యాహ్న భోజన పథకానికి కొత్త పాత్రలు
- మండల కేంద్రాలకు చేరుకుంటున్న సామగ్రి
- 1,528 ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీకి ఏర్పాట్లు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు వారి ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గుణాత్మక విద్యను అందించడమే కాకుండా, వారికి పోషకాహారంతో కూడిన భోజనాన్ని జగనన్న గోరుముద్ద పథకం కింద అందజేస్తోంది. రోజుకొక మెనూతో ఆహారాన్ని అందించడమే కాకుండా, విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించేందుకు వారానికి ఐదు రోజులు కోడిగుడ్డు, సోమ, బుధ, శుక్రవారాల్లో చిక్కీ, మంగళ, గురు, శనివారాల్లో రాగిజావను అందజేస్తోంది. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత సమర్ధవంతంగా నిర్వహించే క్రమంలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసే ఏజెన్సీలకు ప్రభుత్వం వంట పాత్రలు అందజేసేందుకు చర్యలు చేపట్టింది. దశాబ్ద కాలానికి ముందు పంపిణీ చేసిన వంట సామగ్రి జీర్ణదశకు చేరుకోవడాన్ని గుర్తించిన ప్రభుత్వం వంట సామగ్రిని పాఠశాలలకు సమకూర్చుతోంది.

తీరనున్న సమస్య

రోజూ విద్యార్థులకు మిడ్ డే మీల్ ఏజెన్సీలు మధ్యాహ్న భోజనంతో పాటు, రోజు విడిచి రోజు రాగి జావను తయారు చేస్తున్నారు. నిత్యం భోజనం తయారు చేసి వడ్డిస్తున్న మిడ్ డే మీల్ ఏజెన్సీలకు వంట పాత్రల సమస్య వేధిస్తోంది. 2010లో అప్పటి ప్రభుత్వం పాఠశాలలకు వంట పాత్రలు సరఫరా చేసింది. అప్పటి నుంచి వాటినే ఉపయోగిస్తుండడంతో చాలా వరకూ పాఠశాలల్లో వంట పాత్రలు జీర్ణదశకు చేరుకున్నాయి. కొన్ని పాఠశాలల్లో వంట పాత్రలు పూర్తిగా పాడయ్యాయి. మరికొన్ని పాఠశాలల్లో అరకొరగా పాత్రలున్నాయి. వాటితోనే మిడ్ డే మీల్ ఏజెన్సీలు రోజులు నెట్టుకొస్తున్నాయి. ఇటీవల పాఠశాలల్లో వసతులు పెరగడం, విద్యార్థుల సంఖ్య కొన్ని పాఠశాలల్లో రెట్టింపు కావడంతో ఏజెన్సీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజనంలో చేపట్టిన మార్పులకు అనుగుణంగా వంట పాత్రలను ప్రభుత్వం సమకూర్చేందుకు నిర్ణయం తీసుకుంది.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలను ఆరు కేటగిరీలుగా విభజించారు. 30 లోపు విద్యార్థులున్న పాఠశాలలను 'ఏ' కేటగిరీగా, 31–50 విద్యార్థులుంటే 'బి', 51–150 మధ్య విద్యార్థులుంటే 'సీ', 151–250 విద్యార్థులున్న పాఠశాలలను 'డి', 251–400 విద్యార్థులున్న పాఠశాలలను 'ఈ', 400కు మించి విద్యార్థులున్న పాఠశాలలను 'ఎఫ్' కేటగిరీగా విభజించారు. ఆయా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు డబరాలు, బేసిన్లు, కురిపీ, హస్తాలు, వడ్డన చేసుకునేందుకు వీలుగా స్టీలు పాత్రలు అందజేస్తున్నారు. మండల కేంద్రాలకు చేరుకున్న వంట సామగ్రిని ఎండీయూ వాహనాల ద్వారా పాఠశాలలకు చేరుస్తారు. ఇందుకు గాను ఒక్కో కిట్‌కు రూ.150 చొప్పున ఎండీయూ వాహనాలకు చెల్లించనున్నారు.

ఇబ్బందులు తొలగుతాయి



జిల్లా వ్యాప్తంగా పాఠశాలల వారీగా వంట పాత్రలు వస్తున్నాయి. మండల కేంద్రాలకు వచ్చిన ఈ పాత్రలను ఎండీయూ వాహనాల ద్వారా పాఠశాలల పాయింట్లకు చేరుస్తాం. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్టాక్ రిజిస్టర్‌లో ఎంటర్ చేసుకుని, మిడ్ డే మీల్ ఏజెన్సీలకు అందజేస్తారు. మిడ్ డే మీల్ ఏజెన్సీల ఇబ్బందులు తొలగుతాయి.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

ప్రభుత్వం సూక్ష్మ పరిశీలన



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రతి విషయాన్ని సూక్ష్మ పరిశీలన చేస్తోంది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే కాకుండా వారికి వండి, వడ్డించే వంట పాత్రల విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం దీనికి నిదర్శనం.

–జి.నాగమణి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

జిల్లాల వారీగా వంట పాత్రల పంపిణీ ఇలా..

జిల్లా	మండలాలు	పాఠశాలలు
తూర్పుగోదావరి	17	805
కోనసీమ	21	1,528
కాకినాడ	19	724

జిల్లాలో పాఠశాలల వారీగా వంట పాత్రల కిట్ల పంపిణీ

మండలం	ఏ	బీ	సీ	డీ	ఈ	ఎఫ్	మొత్తం
అయినవిల్లి	31	15	17	1	5	2	71
ఆలమూరు	22	7	12	2	3	3	49
అల్లవరం	41	15	15	4	1	2	78
అమలాపురం	43	27	22	2	5	6	105
అంబాజీపేట	41	8	8	3	2	2	64
ఆత్రేయపురం	22	10	15	2	2	2	53
ఐ.పోలవరం	49	12	8	4	3	3	79
కె.గంగవరం	36	17	15	5	2	1	76
కపిలేశ్వరపురం	19	10	14	4	3	1	51
కాట్రేనికోన	29	24	11	3	4	4	75
కొత్తపేట	50	11	13	1	2	5	82
మలికిపురం	45	8	15	4	4	2	78
మామిడికుదురు	46	12	1	9	3	1	72
మండపేట	37	7	9	2	6	6	67
ముమ్మిడివరం	40	19	11	4	3	1	78
పి.గన్నవరం	44	20	6	5	5	2	82
రామచంద్రపురం	37	20	15	3	3	6	84
రావులపాలెం	26	11	6	2	4	3	52
రాజోలు	42	14	3	2	3	4	68
సఖినేటిపల్లి	51	8	13	5	1	3	81
ఉప్పలగుప్తం	51	19	5	2	3	3	83

ఆరోగ్యమే కొండంత బలం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- అమలాపురంలో స్వచ్ఛతా హి సేవా ర్యాలీ



అమలాపురంలో శ్రమదానం చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యానాగేంద్రమణి, కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: మనకు ఆరోగ్యమే కొండంత బలమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతకు ఎంతో కొంత సమయం కేటాయించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అమలాపురం పురవీధుల్లో ఆదివారం ఉదయం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా జరిగిన చైతన్య ర్యాలీలో కలెక్టర్ శుక్లా పాల్గొని ప్రసంగించారు. తొలుత గడియారం స్తంభం సెంటర్‌లో ర్యాలీని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ శుభ్రతతో కలుషితం లేని వాతావరణాన్ని ఆవిష్కరించి తద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాకారం చేసుకునే విధానాలను వివరించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వార్డు కౌన్సిలర్లు చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. పరిశుభ్రత సందేశాలతో కూడిన ప్లకార్డులను చేత బూని ర్యాలీలో పాల్గొని చైతన్యపూరిత నినాదాలు చేశారు. ముమ్మిడివరం గేటు సెంటర్ వరకూ ర్యాలీ సాగింది.

పాఠశాలల్లో 'స్వచ్ఛతా హి సేవ'

రాయవరం: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఆదివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతిపితను స్మరించుకుంటూ ఒక గంట పాటు శ్రమదానం చేశారు. పాఠశాలలు, హాస్టళ్లలో పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, మరుగుదొడ్లను శుభ్రపర్చడం తదితర వాటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు చేపట్టారు. అనంతరం శానిటేషన్ క్లబ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 22 మండలాల పరిధిలోని 2,034 పాఠశాలల్లో ఆదివారం సెలవు అయినప్పటికీ ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి 'స్వచ్ఛతాహి సేవ' కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి నేతృత్వంలో డీవైఈఓ నరసింహ ఫణి, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

కాలువలో మునిగి వ్యక్తి మృతి


శ్రీరామప్రసాద్‌ (ఫైల్‌)

ఆత్రేయపురం: మండలంలో అంకంపాలెం గ్రామానికి చెందిన కరుటూరి శ్రీరామప్రసాద్‌ (40) ప్రమాదవశాత్తూ కాలువలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత నెల 30న అతను అంకంపాలెం శివారు గన్నవరం కాలువలో ప్రమాదవశాత్తూ కాలువలో మునిగి పోయినట్లు అతని భార్య నాగవెంకటదుర్గ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ప్రమాదవశాత్తూ కిందపడి..

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో కోరంగి వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన పాలెపు సత్తిబాబు (45) మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్‌ కథనం ప్రకారం.. సత్తిబాబు బైక్‌పై కాకినాడ వైపునకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ప్రమాదవశాత్తూ తగలడంతో కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో సత్తిబాబు తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి బాలుడు..

ఆత్రేయపురం: మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన సాధనాల గోవిందు (15) పురుగు మందు తాగి గత నెల 30న మృతి చెందినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్‌ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. గత నెల 29న రాత్రి గోవిందు మనస్తాపంతో పురుగు మందు తాగాడు. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి సాధనాల సత్యదుర్గాదేవి ఫిర్యాదు మేరకు శనివారం సాయంత్రం కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్‌ మారూఫ్‌ తెలిపారు. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోటనందూరు మండలం పాత కొట్టాం గ్రామానికి చెందిన పెదపూడి రాజీవ్‌ (36) హంసవరం– తుని రైల్వేస్టేషన్‌ మధ్యలో లెప్రసీ కాలనీ సమీపంలో రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి కల కారణాలు తెలియలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

తీగలకు రాజకీయ అడ్డగింతలు

- మెరుగైన విద్యుత్తు సరఫరాకు సర్కారు యత్నం
- భూములివ్వని ప్రతిపక్ష మద్దతుదారులు
- ఉమ్మడి మూడు జిల్లాలకు కష్టకాలం
- ఉన్నతాధికారుల ఉదాశీనతా కారణం



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఏటేటా పెరుగుతున్న అవసరాలు, వినియోగానికి తగినట్లు విద్యుత్‌ పంపిణీకి మెరుగైన ఏర్పాట్లు చేయడంలో గత టీడీపీ ప్రభుత్వం విఫలమైంది. ముందస్తు ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేయకపోవడంతో వినియోగదారులకు ఇక్కట్లు తప్పలేదు. విద్యుత్‌ సరఫరాలో నిరంతర అవాంతరాలతో ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన లక్షలాది మంది వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. తక్షణ ఇబ్బందులను తొలగించడంతో పాటు భవిష్యత్‌ అవసరాలను పరిగణనలోకి తీసుకున్న వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం రెండేళ్ల కిందటే చర్యలను చేపట్టింది. అయితే ఈ పనులు పూర్తయి విద్యుత్తు సరఫరా సక్రమంగా జరిగితే వినియోగదారుల నుంచి ప్రభుత్వానికి సానుకూలత ఏర్పడుతుందనే భావనతో ఆ గ్రామాల్లో పెద్ద రైతులుగా చలామణి అవుతున్న పలువురు పక్కా ప్రణాళిక ప్రకారం సహాయ నిరాకరణను కొనసాగిస్తున్నారు. తమతో పాటు భూములు ఇవ్వకుండా ఇతర రైతులను కూడా ఉసిగొల్పుతున్నారని సంబంధిత ఉన్నతాధికారులకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ఇలా చేస్తున్న వారిలో ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన వారున్నారని తెలుస్తోంది.

400 కేవీ సబ్‌ స్టేషన్‌ నిర్మాణంతో పాటు..

ఉమ్మడి కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో అవాంతరాలు లేని విద్యుత్తు సరఫరాకు వీలుగా కృష్ణా జిల్లా యలమర్రు వద్ద 400 కేవీ సబ్‌స్టేషన్‌ నిర్మాణంతో పాటు అందుకు అవసరమైన ఫీడర్, లైన్ల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. ఎంఈఐఎల్‌ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుని పనులు చేపట్టింది. గన్నవరం, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని బాపులపాడు, తేలప్రోలు, ఉంగుటూరు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ముక్కపాడు, వింజరంపాడు, వెంట్రప్రగడ, చినపారుపూడి, పెదపారుపూడి మీదుగా యలమర్రుకు 400 కేవీ విద్యుత్తు లైను వెళ్లవలసి ఉంది.

రాజకీయ దురుద్దేశంతో..

విద్యుత్తు లైను నిర్మాణం జరగాలంటే నిర్దేశిత మార్గంలోని భూమి నిర్మాణ సంస్థకు అందుబాటులో ఉండాలి. పనులకు అడ్డంకులు తలెత్తకూడదు. కానీ పై గ్రామాల పరిధిలోని రైతులు ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన పలువురు ఉద్దేశపూర్వకంగానే మోకాలడ్డుతున్నారు. మూడు జిల్లాల పరిధిలోని లక్షలాది మంది వినియోగదారుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నానికి సహాయ నిరాకరణ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల జోక్యం అవసరం

విద్యుత్‌ లైను నిర్మాణం త్వరితగతిన సాగాలన్నా, మూడు జిల్లాల వినియోగదారులకు విద్యుత్తు కష్టాలు తీరాలన్నా రెవెన్యూ, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు సంబంధిత నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల సహకారంతోనైనా సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోలవరం కుడి కాలువ తవ్వకం సమయంలో...

రాష్ట్రానికి వరప్రదాయిని అయిన పోలవరం ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందరి కలలను సాకారం చేయాలని ఆనాటి ముఖ్యమంత్రి, మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి తలచారు. ప్రాజెక్టు నిర్మాణం రూపుదిద్దుకునే లోపు కుడి, ఎడమ కాలువలను కూడా తవ్వించి నీటిని మళ్లించాలని పనులు ప్రారంభింపచేశారు. కుడి కాలువ పనులు ముందుకు సాగకుండా చేసే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఆయాప్రాంత నాయకులు, రైతులు ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టించారు. కోర్టులను ఆశ్రయించారు. భూములు ఇవ్వకుండా, కాలువ పనులను అడ్డుకోగలిగారు. కానీ భూసమీకరణకు అంగీకరించి తమ భూములను అప్పగించిన ప్రాంతాలలో మాత్రం కాలువ తవ్వకం పనులను వైఎస్‌ రాజశేఖరరెడ్డి కొనసాగింపచేశారు. ఆ తర్వాత పట్టిసీమ పేరిట టీడీపీ సర్కారు చేపట్టిన ప్రాజెక్టుకు అదే రైతులు సహకరించి భూములు అప్పగించడంతో బిట్లు బిట్లుగా ఆగిపోయిన పోలవరం కుడి కాలువ పనులు పూర్తయ్యాయి. దీంతో నీటిని విడుదల చేయగలిగారు. ఇప్పుడు కూడా పోలవరం కాలువ పనులకు అడ్డంకులు సృష్టించిన రీతిలోనే విద్యుత్తు లైను నిర్మాణానికి మోకాలడ్డుతున్నారనేది తేటతెల్లం అవుతోంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


ప్రమాద స్థలం వద్ద సేవలందిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్‌

కొవ్వూరు: స్థానిక గామన్‌ బ్రిడ్జిపై ఆదివారం మధ్యాహ్నం బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె భర్త, కుమారుడికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కోనసీమ జిల్లా మండపేట మండలం అర్తమూరుకు చెందిన నిడదవోలు వీరలక్ష్మి (32), భర్త రమణ, కుమారుడు వెంకట్‌లతో కలసి మోటారు సైకిల్‌పై గౌరీపట్నం బయలు దేరారు. మార్గమధ్యంలో కొవ్వూరు– కాతేరు మధ్య గామన్‌ బ్రిడ్జిపైకి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని ఓవర్‌ టేక్‌ చేయడానికి ప్రయత్నించారు. ఆ లారీ వీరి మోటార్‌ సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో వీరలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. బైక్‌ నడుపుతున్న రమణకు స్వల్పంగా, కుమారుడు వెంకట్‌కు బలమైన గాయాలయ్యాయి. వెంకట్‌ అపస్మారక స్థితిలో వెళ్లిపోయాడు. అదే సమయంలో నల్లజర్లలో ఓ శుభకార్యానికి వెళ్లి వస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ ప్రమాదాన్ని గుర్తించి తన కాన్వాయ్‌ను ఆపారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్‌ చేశారు. ఎంపీ వ్యక్తిగత సిబ్బంది సహాయంతో వెంకట్‌ను అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం తరలించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

వీరలక్ష్మీ.. లే

భార్య వీరలక్ష్మి మృతి చెందిన విషయాన్ని రమణ గుర్తించలేదు. అంబులెన్స్‌లో ఆమెను ఎక్కిస్తుండగా అపస్మారకస్థితిలో ఉందని అనుకుని వీరలక్ష్మీ.. లే అంటూ కేకలు వేశారు. అంబులెన్స్‌ సిబ్బంది వీరలక్ష్మి మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకట్‌కు రాజమహేంద్రవరంలో ప్రాథమిక చికిత్స అనంతరం ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. కొవ్వూరు పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

వివిధ శాఖల అధికారులతో కలెక్టర్‌ సమీక్ష


ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఫోన్‌లో మాట్లాడుతున్న రఘురాం, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు కన్నబాబు, పెండెం దొరబాబు, ఎంపీ గీత, దవులూరి దొరబాబు

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 5న సామర్లకోటలో పర్యటించనున్నారు. ఈ ఏర్పాట్లను కలెక్టర్‌ కృతికా శుక్లా, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్‌ కన్వీనర్‌ తలశిల రఘురాం, రాష్ట్ర హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ దవులూరి దొరబాబు, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు ఆదివారం పరిశీలించారు. స్థానిక ఈటీసీ లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను, దివంగత నేత వైఎస్సార్‌ విగ్రహం ఏర్పాటు చేసిన పైలాన్, పార్కు తదితర వాటిని చూశారు. సీఎం పర్యటనలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆయా శాఖల అధికారులు పనులను పూర్తి చేయాలని సూచించారు. షేర్‌ వాల్‌ పద్ధతిలో రూ. 2.15 లక్షలతో నిర్మించిన ఇళ్లతో పాటు, లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్న గృహాలను అధికారులు, ప్రజాప్రతినిధులు చూశారు. ప్రతి ఇంటికీ రంగులు వేయించడంతో పాటు మామిడి తోరణాలతో ఇళ్లను అలంకరించుకునే విధంగా లబ్ధిదారులకు వివరించాలని కలెక్టర్‌ అధికారులకు సూచించారు. ఆయా ప్రదేశాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్‌ కృతికా శుక్లా, తలశిల రఘురాం చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్‌.సతీష్‌కుమార్‌ అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీ లతాకుమారి, సీఐలు అబ్దుల్‌ నబీ, కె దుర్గాప్రసాద్‌లతో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. సామర్లకోట– పెద్దాపురం రోడ్డులో సీఎం హెలిపాడ్‌ ప్రాంతం, ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణలో సభా ప్రాంగణాన్ని వారు పరిశీలించారు. పెద్దాపురం మున్సిపల్‌ కౌన్సిల్‌ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేశారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీడీ వసంతమాధవి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, డీఎల్‌డీఓలు పి.నారాయణమూర్తి, ప్రసాద్, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ నెక్కంటి సాయిప్రసాద్‌ పాల్గొన్నారు.

రేపటి నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమగ్ర శిక్షా ఇన్‌క్లూజివ్‌ ఎడ్యుకేషన్‌ (సహిత విద్య) విభాగంలో ఖాళీగా ఉన్న రిసోర్స్‌ పర్సన్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకూ పరిశీలించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ రీజినల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ జి.నాగమణి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంఆర్‌ 20, హెచ్‌ఐ/వీఐ పోస్టులు 22 ఖాళీలున్నాయి. మొత్తం పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితాలు సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లా కార్యాలయాలకు చేరుకున్నాయి. ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకూ ఉదయం 10 నుంచి ఎంఆర్, హెచ్‌ఐ/వీఐ అభ్యర్థుల సర్టిఫికెట్లను కాకినాడ పీఆర్‌జీ పాఠశాలలో పరిశీలించనున్నారు. 6 నుంచి 9వ తేదీ వరకూ స్కిల్‌ టెస్ట్‌/పర్సనాలిటీ టెస్ట్‌ నిర్వహిస్తారు. 10న ఫైనల్‌ ఎంపిక జాబితా ప్రదర్శిస్తారు. 11న ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్‌ లెటర్లు అందజేస్తారు. 12, 13 తేదీల్లో ఎంపికైన అభ్యర్థులు కాంట్రాక్టు అగ్రిమెంట్‌ రాయాల్సి ఉంటుంది. 16న విధుల్లో చేరాలి. దరఖాస్తు సమయంలో సమర్పించిన సర్టిఫికెట్ల రెండు సెట్లు గెజిటెడ్‌ అధికారి ధ్రువీకరణతో పాటు ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తును అభ్యర్థులు తీసుకురావాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంఆర్‌ పోస్టులకు 195, వీఐ/హెచ్‌ఐ పోస్టులకు 110 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికకు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కమిటీని నియమిస్తారు. ఉమ్మడి జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ చైర్మన్‌గా, ఉమ్మడి జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ మెంబర్‌ కన్వీనర్‌గా, తూర్పు, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీలు మెంబర్లుగా ఉంటారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్‌ కమ్‌ రోస్టర్‌ విధానంలో చేపడతారు.

మానవాళి నడవడికను నిర్దేశించేదే స్మార్తవిద్య



విద్వత్సభలో స్మార్త, ఆగమ, అపర విద్యపై ఉపన్యసిస్తున్న వేద పండితులు

అమలాపురం టౌన్‌: మానవాళి నడవడికను నిర్దేశించేదే స్మార్త విద్య అని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మావుళ్లమ్మ దేవస్థానం ఆస్థాన విద్వాంసుడు యావని వేంకట రాయచంద్ర సోమయాజ ఘనాపాఠి అన్నారు. శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కూచిమంచి అగ్రహారంలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన స్మార్తాగమ అపర విద్వత్సభకు సోమయాజ ఘనాపాఠి అధ్యక్షత వహించి ఉపన్యసించారు. ఈ సభలో స్మార్త, ఆగమ, అపర విద్యలపై ఘనాపాఠీలు చర్చించారు. సభకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 150 మంది వరకూ స్మార్త పండితులు, పురోహితులు హాజరయ్యారు. అన్ని విద్యలకు వేదం మూలమని, వేదానికి ముడిపడే స్మార్త, ఆగమ, అపర విద్యలు ఉన్నాయన్నారు. పుట్టిన ప్రతి మనవుడిని ఉద్ధరించడానికి చేయాల్సిన 16 కర్మలు ఆపస్తంభుడు సూత్రాలకు అనుగుణంగా జరుగుతాయని వివరించారు. సమాజమంతా పురోహితునికి రుణపడి ఉంటుందన్నారు. సమాజాన్ని ఉద్ధరిస్తూ భావితరాల పిల్లలకు విద్యతో పాటు సంస్కారాన్ని కూడా పూర్తిగా నేర్పాలన్నారు. ఈ బాధ్యత పురోహితులు, తల్లిదండ్రులపై ఉందని స్పష్టం చేశారు. వేదస్మార్త పండితులు కర్రా భాస్కరావధానులు, అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితతావధానులు ఉపన్యసించి స్మార్త విద్యలో ఉన్న విశిష్టతను వివరించారు. శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ అధ్యక్షుడు గుళ్లపల్లి ప్రభాకర ఫణిరాజా, కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రామ్, కోశాధికారి యేడిది సుబ్రహ్మణ్యశర్మల పర్యవేక్షణలో ఈ సభ జరిగింది. అనంతరం స్మార్త పండితులను ఘనంగా సత్కరించారు. తర్వాత జరిగిన వేదస్వస్తితో అమలాపురం పట్టణం పావనమైంది. తెలుగు పండితుడు మండలీక ఆదినారాయణతో పాటు వేద, స్మార్త అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గణేశ లడ్డూ రూ.1.11 లక్షలు


రూ.1.11 లక్షలకు దక్కించుకున్న వినాయక లడ్డూతో వైస్‌ ఎంపీపీ నాగం గంగబాబు

తొండంగి: స్థానిక హౌరా బ్రిడ్జి సెంటర్‌లోని వినాయకుని ఆలయం వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం 11 కిలోల స్వామివారి లడ్డూ ప్రసాదానికి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. దీనిని వైఎస్సార్‌ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్‌ ఎంపీపీ నాగం గంగబాబు రూ.1.11 లక్షలకు దక్కించుకున్నారు. రెండేళ్లుగా గంగబాబు వేలంలో లడ్డూను దక్కించుకుంటున్నారు. ఆయన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. గణేశ యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

అల్లిపురం (విశాఖపట్నం): జల్సాలకు అలవాటు పడ్డారు. ఈజీమనీపై దృష్టిసారించారు. పైగా ఎలక్ట్రీషియన్లు కావడంతో బైక్‌ దొంగతనాలు సులువుగా చేసుకుంటూ పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. పాపం పండింది. ఇద్దరు యువకుల్లో ఒకరు విశాఖపట్నం పోలీసులకు దొరికిపోయాడు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నగర క్రైం డీసీపీ గంధం నాగన్న తెలిపిన వివరాలు.. కోనసీమ అంబేడ్కర్‌ జిల్లా మామిడికుదురు మండలానికి చెందిన రొక్కం పవన్‌కుమార్, మేడిద శ్రీనివాసరావు అలియాస్‌ కుక్క పండు ఇద్దరూ కొబ్బరికాయల వ్యాపారులు. వీరిద్దరూ అమలాపురంలో కొబ్బరికాయలు కొని వేరే ప్రాంతాల్లో అమ్మేవాళ్లు. వ్యాపారంలో శ్రీనివాసరావు చాలామందిని మోసం చేశాడు. జల్సాలకు అలవాటు పడిన వారు మోటారు సైకిళ్ల దొంగతనానికి పాల్పడేవారు. ఇద్దరు ఎలక్ట్రీషియన్లు కావడంతో తాళాలు లేకుండానే మోటార్‌ సైకిళ్లను సులువుగా దొంగతనం చేసేవాళ్లు. ఆంధ్ర, తెలంగాణలో మొత్తం 10 ద్విచక్రవాహనాలు దొంగతనం చేశారు. విశాఖపట్నం జిల్లా మర్రిపాలెం భాస్కర్‌ గార్డెన్స్‌లో నివసిస్తున్న వడ్డా యశ్వంత్‌ ఆగస్టు 27వ తేదీ రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో రాయల్‌ ఇన్‌ఫీల్డ్ మోటార్‌ సైకిల్‌ తన ఇంటి ముందు పార్కు చేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు ఎయిర్‌పోర్టు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నగర పోలీస్‌ కమిషనర్‌ ఆదేశాల మేరకు, నగర క్రైం డీసీపీ జి.నాగన్న, ఏడీసీపీ గంగాధర్‌తో పర్యవేక్షణలో సీసీఎస్‌ సీఐ జి.అప్పారావు తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితులు కోనసీమ అంబేడ్కర్‌ జిల్లా, మామిడికుదురు మండలానికి చెందిన రొక్కం పవన్‌కుమార్, మేడిద శ్రీనివాసరావు అలియాస్‌ కుక్క పండుగా గుర్తించారు. సెప్టెంబర్‌ 25వ తేదీన మర్రిపాలెం, రైల్వే స్టేషన్‌రోడ్డులో పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి సుమారు రూ.18 లక్షల విలువ చేసే ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు మేడిద శ్రీను పరారీలో ఉన్నాడని డీసీపీ నాగన్న ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

టెక్నికల్‌ ఆఫీసర్స్ అసోసియేషన్‌ కార్యవర్గం ఎన్నిక

ధవళేశ్వరం: ఏపీ టెక్నికల్‌ ఆఫీసర్స్ అసోసియేషన్‌ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ధవళేశ్వరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ సూర్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎల్‌ సోమయాజులు ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా డిప్లొమో ఇంజినీర్స్ అసోసియేషన్‌ నాయకులు ఎ.సాయిరాం, బీవీ నాగేశ్వరరావు వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా జీవీ రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్, కోశాధికారిగా ఎం.వెంకటరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.నందీశ్వరుడు, ఉపాధ్యక్షులుగా ఎస్‌.శ్రీకృష్ణ, ఏవీఎస్‌ఎన్‌ మోహన్, కేఎన్‌ఎస్‌ఎస్‌ హనుమాన్, ఎస్‌కేఎన్‌ఎమ్‌ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా కేఎస్‌ఎన్‌ రాజు, సహ కార్యదర్శులుగా టి.హిమవంతరావు, యు.సత్యనారాయణ, ఏవీఎస్‌ఆర్‌ఎస్‌ మూర్తి, వీఎస్‌వీ సత్యనారాయణ, డీపీఆర్‌ రత్నకుమారి, కార్యనిర్వాహక సభ్యులుగా బి.సూర్యతేజ, జీఎస్‌కే వీవీ ప్రసాద్, ఎస్‌కే హుస్సేన్‌ తదితరులు ఎన్నికయ్యారు.

స్వచ్ఛతను యజ్ఞంలా తీసుకుందాం..


విద్యార్థులతో కలసి శ్రమదానం చేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: యువత స్వచ్ఛతను ఒక యజ్ఞంగా తీసుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛతా హి సేవ– ఒక రోజు, ఒక గంట కార్యక్రమాన్ని విద్యార్థులతో కలసి యూనివర్సిటీ ప్రాంగణంలో ఆదివారం చేపట్టారు. విద్యార్థులు ఇంటి వద్ద తల్లిదండ్రులకు సహాయ పడుతూనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఇరుగుపొరుగు వారిని చైతన్య పర్చాలన్నారు. సమాజం పట్ల యువత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే పెద్దలలో కూడా మార్పు వస్తుందని, తద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ప్రజారోగ్యాన్ని కూడా కాపాడవచ్చన్నారు. స్వచ్ఛతా హి సేవ ఒక రోజు, ఒక గంటకు పరిమితం కాదని, నిత్యం మనం ఆచరించేందుకు దీనిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో 290 వరకూ ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్లు ఉన్నాయని, వీరంతా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం శ్రమదాన్‌ స్వచ్ఛతపై అంతా కలసి ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌ఎస్‌ఎస్‌ కో ఆర్డినేటర్‌ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్‌ ఇన్‌చార్జి ఆచార్య పి.సురేష్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతకు ప్రజల భాగస్వామ్యం అవసరం


కోటిలింగాల రేవులో చీపుర్లతో ఊడ్చుతున్న ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ అమిత్‌నారాయణ్‌

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్‌): ప్రధాని మోదీ పిలుపులో భాగంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని ఓఎన్జీసీ సంస్థ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్, అసెట్‌ మేనేజర్‌ అమిత్‌ నారాయణ్‌ అన్నారు. ఓఎన్జీసీ రాజమహేంద్రవరం అసెట్‌ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని కోటిలింగాల రేవును శుభ్రం చేశారు. ఆదివారం ఉదయం ఒక గంట పాటు సుమారు 300 మంది ఓఎన్జీసీలోని వివిధ విభాగాల ఉద్యోగులు, అధికారులు, పాఠశాల విద్యార్థులు, ఎస్‌పీఎఫ్, నగరపాలక సంస్థ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది స్వయంగా చీపుర్లు పట్టి శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అమిత్‌ నారాయణ్‌ మాట్లాడుతూ ప్రధాని పిలుపు మేరకు సామాజిక సేవా బాధ్యతతో కోటిలింగాల రేవును శుభ్రం చేసే కార్యక్రమాన్ని ఓఎన్జీసీ నిర్వహించిందన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందన్నారు. తమ ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్టుగానే నగరాన్ని, పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.